సాక్షి
పెద్దపల్లి
గురువారం । 17 । జూలై । 2025



స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

రామగిరి: స్వచ్ఛ సర్వేక్షణ్ - 2025 బృందం బుధవారం రత్నాపూర్‌ను సందర్శించింది. గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రాలు, వర్మీకంపోస్టు తయారీపై ఆరా తీసింది.



గంగమ్మకు బోనాలు

మంథని: బోయిన్‌పేట బెస్త కులస్తులు గంగమ్మకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. తొలుత పట్టణ పురవీధుల్లో బోనాలు, వలలతో ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి పూజలుచేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.






ఆటో.. సామర్థ్యానికి మించి..

'ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.. అతివేగం వద్దు.. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు.. సౌండ్‌సిస్టమ్ అసలే వాడొద్దు.. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్ద'ని సంబంధిత శాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఇదేసమయంలో విద్యార్థులను తరలించే పాఠశాలల బస్సులు, ఆటోల డ్రైవర్లు, యజమానులకూ వివరిస్తూనే ఉన్నారు. అయినా, నిబంధనలు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. సామర్థ్యానికి మించి, నిబంధనలు అతిక్రమిస్తూ ఆటోల్లో చిన్నారులను ఇంటి నుంచి బడికి, బడి నుంచి ఇంటికి తరలిస్తూనే ఉన్నారు. గ్రామాల్లో అయితే, ప్రమాదాల సంఖ్య తక్కువగా ఉంటున్నా.. మెయిన్ రోడ్లు, రాష్ట్ర రహదారిపై ఇలాంటి ఆటోలు రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయి. ఇందుకు నిదర్శనమే జిల్లా కేంద్రంలో 'సాక్షి' కెమెరాకు చిక్కిన ఈ చిత్రాలు.. అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే..

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



న్యూస్‌రీల్

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఖరారు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో ప్రస్తుతం 13 జెడ్పీటీసీ, 140 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తాజాగా మూడు ఎంపీటీసీ స్థానాలు తగ్గించి 137కే పరిమితం చేశారు. ఇందులో వెంకట్రావుపల్లి, లింగాపూర్ పంచాయతీలు రామగుండం కార్పొరేషన్‌లో విలీనం కాగా, పెద్దంపేట(రామగిరి మండలం) గ్రామాన్ని జల్లారం ఎంపీటీసీ స్థానం పరిధిలో విలీనం చేశారు. దీంతో ఎంపీటీసీల స్థానాల సంఖ్య 137కే పరిమితమైందని, జెడ్పీటీసీ స్థానాల్లో మార్పేమీలేదని జెడ్పీ సీఈవో నరేందర్ వివరించారు.

సమన్వయంతో పరిష్కారం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో తలెత్తే విద్యుత్ సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి బుధవారం తన కార్యాలయంలో ఆయన విద్యుత్ తదితర సమస్యలు, వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కొత్తగా వేసే విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు విస్తరణ, మురుగునీటి కాలువల నిర్మాణ సమయంలో అవసరమైతే విద్యుత్ స్తంభాలు మార్చాలని అన్నారు. అదేవిధంగా భూసంబంధ సమస్యలపై అందిన అర్జీలను ఈ నెలాఖరు వరకు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. భూభారతి -రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని అన్నారు. విద్యుత్ ఎస్‌ఈ గంగాధర్, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్, రమేశ్, వెంకన్న, ఆర్డీవోలు గంగయ్య, సురేశ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

26న ఇందిరాశక్తి వేడుకలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే ఇందిరా మహిళాశక్తి సంబురాలకు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సభకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతిగౌడ్, ప్రతినిధులు ఉరిమెట్ల రాజలింగం, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, జూల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

19న అథ్లెటిక్స్ పోటీలు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, గట్టయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు పూర్తి వివరాల కోసం పీఈటీ అజయ్, 99595 24375 నంబరులతో సంప్రదించాలని వారు సూచించారు.

చెట్టు కూలి కొంగలు విలవిల



కూలిన చింతచెట్టుపై కొంగలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని అడ్డగుంటపల్లి ప్రధాన రహదారిలోని భారీచింతచెట్టు బుధవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నరికివేయించారు. రహదారి విస్తరణలో భాగంగా దానిని తొలిగించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. ఈ చెట్టుపై సేదతీరుతున్న కొంగలు, మరికొన్ని పక్షులు రాత్రి వరకూ కొమ్మలపైనే ఉండిపోయాయి. కొన్ని పక్షులు అదుపుతప్పి చెట్టు కిందపడడంతో మరణించాయి. రోడ్ల విస్తరణకు అడ్డుగా ఉన్నచెట్ల తొలగింపు అనివార్యం అయినప్పటికీ నీడనిచ్చే భారీ చెట్లు నేలకూలడంపై పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెట్టు కిందపడి మృత్యువాతపడిన కొంగలు

అభివృద్ధే లక్ష్యం

- పెద్దపల్లి ప్రగతిపై ప్రత్యేక దృష్టి
- పామాయిల్ పంటను ప్రోత్సహించాలి
- మంత్రులు తుమ్మల, సీతక్క, శ్రీధర్‌బాబు



సంబురాలకు హాజరైన మహిళలు



చెక్కులు అందిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, సీతక్క, ఎమ్మెల్యేలు ఠాకూర్, విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తపిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విజయరమణారావును ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం మీ అదృష్టమన్నారు. మంచి ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కోతులు, పందులే కాదు దేనితోనూ నష్టం జరగని పంట పామాయిల్ అని, ఈ పంట సాగు చేసే రైతులకు రాయితీ వర్తింపజేస్తున్నామని తుమ్మల తెలిపారు. కేంద్రప్రభుత్వం దిగుబడి ధర తగ్గించేందుకు కుట్ర పన్నితే పెంచేలా ఒత్తిడి తెస్తున్నామన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మిస్తున్నామన్నారు. కొద్దిరోజుల్లోనే సిద్దిపేట సమీపంలోనూ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని వివరించారు.

'మార్పు' చూపిస్తున్నాం

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అన్నివర్గాల వారిలో మార్పు తెచ్చి చూపించిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే విజ్ఞన్న అభ్యర్థన మేరకే మహిళల్లో నైపుణ్యాన్ని పెంచేలా శిక్షణను ఇచ్చేందుకు పెద్దపల్లిలో వీ-హబ్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వచ్చేనెలలో ఈ సెంటర్‌ను ప్రారంభిస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు.

అక్కా.. నాణ్యమైన చీరలు ఇప్పించు



బతుకమ్మ పండుగ కానుకగా ఆడబిడ్డలకు ప్రభుత్వం అందించే చీరలు నాణ్యంగా ఉండేలా చూడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మంత్రి సీతక్కను అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ పాలకులు పంపిణీ చేసిన చీరలను పంట చేలకు రక్షణగా, ఇంటి పనుల వద్ద వాడుకున్నారని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని 4,521 మహిళా సంఘాలకు రూ.4కోట్ల94లక్షల వడ్డీలేని రుణాలను పంపిణీ చేశామని, స్త్రీనిధి ద్వారా 514 సంఘాలకు రూ.11కోట్ల75లక్షలు అందించామని తెలిపారు. పెద్దపల్లి, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, సుల్తానాబాద్ మండల సమాఖ్యలకు బస్సులు అందించామన్నారు.

మహిళాసాధికారతే లక్ష్యం.. మంత్రి సీతక్క



డప్పులు వాయిస్తూ మహిళల సందడి

మహిళా సాధికారిత లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సీతక్క అన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు సైతం మహిళల పేరిట మంజూరు చేస్తున్నామని తెలిపారు. రుణ వాయిలను సకాలంలో చెల్లిస్తుండడంతో మహిళాసంఘాలకే మళ్లీ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారని సీతక్క వివరించారు. తెలంగాణ మహిళల శక్తియుక్తులను ప్రధాని నరేంద్రమోదీ సైతం ప్రశంసించారని ఆమె గుర్తుచేశారు.

మహిళల్ని ప్రోత్సహిస్తున్న సర్కార్

మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం అన్నిరంగాల్లో ప్రాధాన్యతనిస్తోందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కోయశ్రీహర్షతో పాటు అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, వేణు, ఆర్డీవోలు గంగయ్య, సురేశ్, జెడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో కాళిందిని, డిఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



తమకు కేటాయించిన బస్సుల వద్ద మండల సమాఖ్య మహిళా గ్రూప్ సభ్యుల విజయదరహాసం



ఆటో డ్రైవింగ్ చేస్తున్న డీఆర్డీవో కాళిందిని

సేవతోలనే మంచిగుర్తింపు

పెద్దపల్లిరూరల్: సేవలు అందించిన వారికే ప్రభుత్వ అధికారులుగా మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. బదిలీపై వెళ్తున్న డీఏవో ఆదిరెడ్డికి రాఘవాపూర్ రైతువేదికలో బుధవారం వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు ఆదిరెడ్డిని ఘనంగా సత్కరించారు. పెద్దపల్లిలో పనిచేసిన కాలం మరువలేనిదని ఆదిరెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులు తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞుడనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విత్తన, ఎరువుల డీలర్ల అసోసియేషన్ నాయకులు, పెద్దపల్లి, మంథని ఏడీఏలతో పాటు ఏవో, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.



ఆదిరెడ్డిని సత్కరిస్తున్న అధికారులు, డీలర్లు

ధాన్యం మద్దతు ధర పెంపు

పెద్దపల్లిరూరల్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ధాన్యం మద్దతు ధర ఖరారైందని అడిషనల్ కలెక్టర్ వేణు బుధవారం తెలిపారు. ఈమేరకు ఏ – గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకం రూ.2,369గా కేంద్రప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించుకోవాని ఆయన సూచించారు.




బోనమెత్తి.. నృత్యం చేసి..

కోల్‌సిటీ(రామగుండం): రజకుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వరస్వామి బోనాల జాతర గోదావరిఖనిలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎల్బీనగర్ రజక సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటా బోనం తీసుకుని డప్పుచప్పుళ్లు, శివశక్తుల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అడ్డగుంటపల్లిలోని మడేలేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు కొండపర్తి సంజీవ్, మామిడి పోశం, బొడ్డుపెల్లి రంజిత్, మామిడి రమేశ్, గూడెపు రామచందర్, మామిడి రాజయ్య, పూసాల రాజయ్య, కొత్తపెల్లి శంకర్, పున్నం సారయ్య, మామిడి కుమార్, మామిడి మహేందర్, మామిడి అశోక్, పూసాల శ్రీనివాస్, పూసాల శీను తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లోడింగ్ లొల్లి

- ఆందోళనకు దిగుతున్న లారీ డ్రైవర్లు
- పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు
- రహదారికి ఇరువైపులా లారీల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య



ముత్తారం రోడ్డుపై బైఠాయించిన లారీ డ్రైవర్లు

మంథని: ఇసుక క్వారీల్లో లోడింగ్ వివాదాస్పదమవుతోంది. దూర ప్రాంతాల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు వస్తున్న లారీల్లో లోడింగ్ ఆలస్యమవుతోందని, స్థానికులు, డబ్బులు ఇచ్చిన వారి లారీల్లోనే ఇసుక లోడ్ చేస్తున్నారని లారీ డ్రైవర్లు ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 13న మంథని మండలం అడవిసోమన్‌పల్లి ఇసుక క్వారీ వద్ద లోడ్ చేసుకునేందుకు వచ్చిన లారీ డ్రైవర్లు మంథని – కాటారం మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. అలాగే నాలుగు రోజుల క్రితం నియోజకవర్గంలోని బెగ్లూర్ ఇసుక క్వారీ వద్ద ఇదే పరిస్థితి నెలకొందని డ్రైవర్లు ఆందోళనకు దిగారు. బుధవారం కూడా ముత్తారం మండలం ఖమ్మంపల్లి ఇసుక క్వారీ వద్ద డ్రైవర్లు ధర్నా చేశారు. రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని, డబ్బులు ఇచ్చిన వారికే ఇసుక లోడ్ చేస్తున్నారని వారు ఆవేదన చెందారు.

సౌకర్యాలు లేక అవస్థలు..

వందల కిలో మీటర్ల దూరం నుంచి ఇసుక తీసుకు వెళ్లేందుకు మానేరు తీరంలోని క్వారీ వద్దకు వస్తున్న లారీ డ్రైవర్లు తమ వాహనంలో లోడ్ చేసుకునేందుకు నాలుగు నుంచి ఐదు రోజుల పాటు పడిగాపులు కాస్తున్నారు. అయినా, క్వారీల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో రాత్రి, పగలు చెట్లనీడ నిరీక్షించాల్సి వస్తోందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా లారీల బారులు..

ఇసుక లోడింగ్‌కు ఆలస్యమవుతుండడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా లారీలను పార్కింగ్ చేస్తున్నారు. కిలో మీటర్ల మేర పెద్దఎత్తున లారీలు రోడ్డుకు ఇరువైపులా ఇలా నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అలాగే రాత్రివేళలో వచ్చేవాహనాలతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. వివాదాలకు కారణవుతున్న అధికారులపై దృష్టి సారించి ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

మళ్లీ రోడ్డెక్కిన లారీ డ్రైవర్లు

ముత్తారం(మంథని): ఖమ్మంపల్లి – తాడిచర్ల మానేరు బ్లాక్–2 క్వారీలో తమ లారీల్లో ఇసుక నింపడం లేదని ఆరోపిస్తూ పలువురు డ్రైవర్లు బుధవారం మరోసారి ధర్నా చేశారు. ఇదే సమస్యపై ఇటీవలకే వారు ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం డీడీ చెల్లించి ఇసుక క్వారీ వద్ద వారం రోజులుగా నిరీక్షిస్తున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి రుసుం చెల్లించకుండా వచ్చే ఒక్కోలారీకి రూ.4,700 తీసుకుంటూ ఇసుక నింపుతున్నారని వారు ఆరోపించారు. రోజుల తరబడి నిరీక్షిస్తూ, ఆకలికి అలమటిస్తున్నా తమ మొర ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అధికారుల సహకారంతోనే క్వారీ నిర్వాహకులు, సూపర్‌వైజర్లు కుమ్మక్కై ప్రభుత్వ ఇసుకను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

రక్షణ దుస్తులు ధరించి పనిచేయాలి

- రామగుండం బల్దియా డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి
- పారిశుధ్య సిబ్బందికి సేఫ్టీపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

కోల్‌సిటీ(రామగుండం): పారిశుధ్య సిబ్బంది విధి నిర్వహణలో వ్యక్తిగత రక్షణ దుస్తులు, పరికరాలు తప్పనిసరిగా ఉపయోగించాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి సూచించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికతోపాటు 'నమస్తే డే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ డే)'ను పురస్కరించుకొని పారిశుధ్య సిబ్బందితో నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం అవగాహన కల్పించారు. సఫాయి మిత్రలకు ప్రభుత్వం ఆయుష్మాన్ హెల్త్ కార్డులు అందజేస్తూ మరో రూ.5లక్షలు అదనపు బీమా కవరేజ్ కల్పిస్తున్నదని తెలిపారు. ఈ పథకం వర్తించడానికి డాక్యుమెంట్లతో పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. అంతకుముందు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చేపట్టిన వివిధ పనులను ఆయన పర్యవేక్షించారు. ద్వారకా నగర్‌లో స్లమ్ సమాఖ్య సమావేశంలో పాల్గొని తడి, పొడి చెత్త, రీసైక్లింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సప్తగిరి కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. రామగుండం హౌసింగ్ బోర్డ్ కాలనీలో పిచ్చిచెట్లు, పొదలు తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కుమారస్వామి, కిరణ్, నాగభూషణం, ఆర్‌ఐ శంకర్‌రావు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళలకు ఏంచేశారని సంబురాలు?

- కేసీఆర్‌పై కోపంతోనే గోస పెడుతున్నారా?
- రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు
- మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, టీఎస్టీఎస్ మాజీ చైర్మన్ రాకేశ్



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి, రాకేశ్

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ఏంచేసిందని పెద్దపల్లిలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నిలదీశారు. ముగ్గురు మంత్రులు వేడుకలకు హాజరయ్యారే తప్ప మహిళలు, రైతుల కోసం ఏం చేశారో చెప్పనే లేదన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతమంది మహిళలకు రూ.2500 ఇస్తున్నారు, సబ్సిడీగ్యాస్, విద్యుత్ బిల్లుల మాఫీ లాంటి పథకాలను ఎంతమందికి వర్తింపజేసారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు నాలుగు ఠాణాలు మంజూరు చేసినా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని టీఎస్టీఎస్ మాజీ చైర్మన్ చిరుమిల్ల రాకేశ్ విమర్శించారు. సాగునీటిపై మంత్రులను ప్రశ్నిస్తారనే భయంతోనే రైతులను ముందస్తుగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. డీసీపీ ఆఫీసు సమీపంలోనే కత్తుల దాడుల్లో ఇద్దరిని హతమార్చిన ఘటన జరిగి గంటలు కూడా కాలేదని తెలిపారు. చెరువుల్లోకి కాళేశ్వరం నీటిని మళ్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, శ్రీధర్, చంద్రశేఖర్, వెంకటేశ్, రాజు, ఫహీం, సరేశ్, శివకుమార్, రవి, కుమార్, మనోజ్, శ్రీనివాస్, కిరణ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్టీపీసీ సీఎండీ పదవీకాలం పొడిగింపు



గుర్దీప్‌సింగ్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) గుర్దీప్‌సింగ్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన మళ్లీ నియమించాలనే విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రతిపాదనను క్యాబినెట్ నియామకాల కమిటీ(ఏసీసీ)ఆమోదించింది. ఆయన ఉద్యోగ విరమణ తేదీ తర్వాత ఏడాదిపాటు (01.08.2025 నుంచి 31.07.2026 వరకు) పొడిగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ దారక్ ఉత్తర్వులను మంత్రిత్వ శాఖ సెక్రటరీ పంకజ్ అగర్వాల్ విడుదల చేసినట్లు సమాచారం.

రాజీమార్గమే మేలు

గోదావరిఖనిటౌన్: ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడమే మేలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ సూచించారు. స్థానిక న్యాయస్థానంలో బుధవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి మాట్లాడారు.

కొడుకు చనిపోయాడనే బెంగతో తండ్రి ఆత్మహత్య

ముత్తారం(మంథని): చేతికి అందిన కొడుకు చనిపోయాడనే బెంగతో మారం రాజిరెడ్డి(55) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని కాసార్లగడ్డలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మారం రాజిరెడ్డి వ్యవసాయ కూలీగా పని చేసుకుంటున్నాడు. వచ్చేఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే, ఇతడి కొడుకు రమేశ్‌రెడ్డి గతేడాది పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్నుంచి తీవ్రమనోవేదనతో ఉంటున్నాడు. తన కన్నకొడుకు మృతి చెందడం బాధిస్తోందని తన భార్యకు తరచూ చెప్తూ ఏడ్చేవాడు. ఈక్రమంలో కొడుకు లేడనే ఆవేదనతో ఈ నెల 15న రాజిరెడ్డి పురుగుల మందు తాగి ఇంట్లోనే పడుకున్నాడు. కూలీ పనికి వెళ్లి ఇంటికి వచ్చిన భార్య పద్మ నిద్రలేపేందుకు యత్నించగా.. తాను పురుగుల మందు తాగానని చెప్పాడు. సమీప బంధువులకు సమాచారం అందించిన పద్మ వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అజ్ఞాతంలో 16మంది కీలకనేతలు

- పెద్దపల్లిలో 10 మంది, మంచిర్యాలలో ఆరుగురు
- జనజీవన స్రవంతిలోకి వచ్చేవారికి పునరావాస కల్పన
- లొంగిపోయేలా నిర్బంధం పెంచుతున్న పోలీసులు

రామగుండం పోలీస్‌కమిషనరేట్‌లో మావోయిస్టులు

పెద్దపల్లి జిల్లా:	మంచిర్యాల జిల్లా:
10	06



మల్లా రాజిరెడ్డి, అప్పాసి నారాయణ, మల్లోజుల వేణుగోపాల్‌రావు, పుల్లూరి ప్రసాదరావు, కంకణాల రాజిరెడ్డి, సలాకుల సరోజ, జాడి వెంకటి, బండి ప్రకాశ్, బబ్బెర రవి

గోదావరిఖని: మావోయిస్టులపై కేంద్రప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఒకవైపు వేట కొనసాగిస్తూనే మరోవైపు కీలక మావోయిస్టు నేతల లొంగుబాట్లను ప్రోత్సహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లలో కీలక నేతలు మృతి చెందగా, కొందరు లొంగుబాటు ఎంచుకుంటున్నారు. గత ఏడాదిలో మావోయిస్టు కీలక నేత నంబాల కేశవరావుతో సహా 357మందికిపైగా నక్సల్స్ మృతి చెందారు. అయితే, బూటకపు ఎన్‌కౌంటర్‌లో 80 మంది వరకు చనిపోగా.. మొత్తం మృతుల్లో 136 మంది మహిళా నక్సల్స్ ఉన్నట్లు మావోయిస్టు పార్టీ తన డాక్యుమెంటరీలో వెల్లడించింది. అనారోగ్యంతో నలుగురు, ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు తెలిపింది.

దండకారణ్యం జల్లెడ..

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నారు. ఆకురాలే కాలంలో మొదలైన ముప్పేట దాడి ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో కీలక నేతలను కాపాడుకోవడం కోసం, పార్టీ ఉనికి చాటుకోవడం కోసం అగ్రనాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గత వ్యూహం ఏమైనా.. పోలీసులు బలగాలు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రతీసారి నక్సల్స్‌పై పైచేయి సాధిస్తూనే ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు నిర్బంధం పెరగడం, ఇదేసమయంలో వారి సమాచారం బయటకు పొక్కడంతో కీలక కేడర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న చాలా మంది లొంగిపోయేందుకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రామగుండం పోలీస్ కమిషనర్ ఎదుట మంగళవారం లొంగిపోయిన మావోయిస్టు దంపతులు ఇదే విషయాన్ని వెల్లడించాడు. దీంతో అనారోగ్యంతో బాధపడే నేతలు జనజీవన స్రవంతిలోకి రావడానికి ఆసక్తి చూపుతున్నారని భావిస్తున్నారు.

కీలకనేతలపై పోలీసుల ఫోకస్..

రామగుండం పోలీసు కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో కీలక నేతలపై పోలీసులు ఫోకస్ పెట్టారని తెలుస్తోంది. నక్సల్స్ కుటుంబ సభ్యులను కలవడం, బాగోగులు తెలుసుకుని ఆర్థిక సాయం చేయడం తరచూ చేస్తూనే ఉన్నారు. నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిసేలా సూచించాలని వారికి చెబుతున్నారు.

కీలకనేతలు	క్యాడర్	గ్రామం	రివార్డు (రూ.లక్షల్లో)
పెద్దపల్లి జిల్లా:			
మల్లా రాజిరెడ్డి	సీసీఎం సెక్రటరీ	ఎగ్లాస్‌పూర్, మంథని	25
అప్పాసి నారాయణ	డీసీఎం, టెక్నికల్‌టీం	రామగుండం	5
గంకిడి సత్యనారాయణరెడ్డి	ఎస్‌సీఎం	సబ్బితం, పెద్దపల్లి	20
మల్లోజుల వేణుగోపాల్‌రావు	సీసీఎం	పెద్దపల్లి టౌన్	25
ఆలేటి రామలచ్చులు	డీసీఎస్	పాలితం, పెద్దపల్లి	8
దాతు అయిలయ్య	కమాండర్	గోపయ్యపల్లి, పెద్దపల్లి	5
పుల్లూరి ప్రసాదరావు	సీసీఎం, గైడింగ్	వడ్కాపూర్, జూలపల్లి	25
ధీకొండ శంకరయ్య	కమాండర్	వెంకట్రామ్‌పల్లి, జూలపల్లి	5
కంకణాల రాజిరెడ్డి	ఎస్‌సీఎం	కిష్టంపేట్, కాల్వశ్రీరాంపూర్	20
జువ్వాడి వెంకటేశ్వర్‌రావు	ఏసీఎం	కొదురుపాక, సుల్తానాబాద్	4
మంచిర్యాల జిల్లా:			
సలాకుల సరోజ	దండకారణ్య స్పెషల్‌జోన్	కన్నాలబస్తీ, బెల్లంపల్లి	20
ఆరేపల్లి కృష్ణ	ఏసీఎస్	కన్నాలబస్తీ, బెల్లంపల్లి	5
జాడి పుష్ప	డీసీఎం, టెక్నికల్	చంద్రవల్లి, తాళ్లగురిజాల	5
జాడి వెంకటి	ఏసీఎం, టెక్నికల్	చంద్రవల్లి, తాళ్లగురిజాల	20
బండి ప్రకాశ్	సికాస	మందమర్రి	20
బబ్బెర రవి	పార్టీ మెంబర్	మందమర్రి	5

పునరావాసంపైనా దృష్టి

జనజీవన స్రవంతిలో కలిసేవారిపైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మావోయిస్టుల నేతలపై ఉన్న రివార్డును వారికే అందజేస్తూ ప్రభుత్వ భూమి, ఇళ్లు, సమాజంలో గౌరవంగా బతికేలా శ్రద్ధ చూపిస్తున్నారు. ఈక్రమంలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారిపెల్లి గ్రామానికి చెందిన ఆత్రం లచ్చన్న, ఆయన భార్య చౌదరి అంకుబాయి మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిపై ఉన్న రూ.25లక్షల రివార్డును వారికే అందజేశారు.

కలవరపెడుతోన్న అనారోగ్య సమస్యలు

మావోయిస్టు పార్టీలో కీలక నేతలు ఐదుపదుల వయసు దాటిన వారే ఉండడంతో నిర్బంధానికితోడు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా వైద్య సదుపాయం లభించక చాలామంది మావోయిస్టులు ఇతర రాష్ట్రాలకు వలసపోవడం, మరికొందరు చేసేదేమీ లేక లొంగుబాటు ఎంచుకుంటున్నారని తెలిసింది.

లొంగిపోతే పునరావాసం



మావోయిస్టులు తుపాకీతో సాధించేదేమీలేదు. జనజీవన స్రవంతిలో కలిసి బ్యాలెట్ పద్ధతిన పోటీ చేయాలి. ప్రజలకు సేవలు అందించాలి. మారుమూల ప్రాంతాల్లో చైతన్యం పెరిగింది. అభివృద్ధిని స్వాగతిస్తున్నారు. నక్సల్స్ పాత కాలం నాటి సిద్ధాంతాలతో సాధించేదేమీ లేదు. లొంగిపోయే మావోయిస్టులకు అన్నివిధాలా సహరిస్తాం.

– అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం

పడిపోయిన సన్నబియ్యం ధరలు

- పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట



సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో సన్నబియ్యం ధరలు గణనీయంగా తగ్గాయి. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటను కలిగించినట్లయ్యింది. గతంలో క్వింటాల్ ధర రూ.5,000 నుంచి రూ.6,000 వరకు పలికిన ధర.. ఇప్పుడు రూ.4,500 నుంచి రూ.4,000కు పడిపోయింది.

ధరల తగ్గుదలకు కారణాలు..

రాష్ట్రప్రభుత్వం ఇటీవల సన్నవడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. అంతేగాకుండా, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఫలితంగా ధరలు పడిపోయాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకంతో సన్నవడ్ల సాగు విస్తీర్ణం, దిగుబడి పెరుగుతోంది. ఇది మార్కెట్‌లో సన్న బియ్యం ధరల తగ్గుదలకు దారితీస్తోందంటున్నారు.

రేషన్‌కార్డు లేనివారికి ప్రయోజనం

జిల్లాలో సుమారు 35వేల కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవని అధికారులు చెబుతున్నారు. వీరికి ప్రతి నెలా దాదాపు 10 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమంటున్నారు. ఇప్పుడు ధరలు తగ్గడంతో వీరికి ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నారు.

సన్నబియ్యం ధరలు(క్వింటాలుకు రూ.లలో)

రకం	ధర
హెచ్‌ఎంటీ	5,600 – 4,600
కర్నూల్ మసూరి	4,800 – 4,000
జైశ్రీరామ్	5,800 – 4,600

కాంగ్రెస్ పార్టీకి ఎదురే లేదు

- బీజేపీ, బీఆర్‌ఎస్ బండారాన్ని ఎండగట్టండి
- పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు నిఖార్సయిన కార్యకర్తలకే
- ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్

కరీంనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి దేశానికి రోల్‌మోడల్‌గా మారుతోందని, రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ముందుకు సాగాలని ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం డీసీసీ కార్యాలయంలో జరిగిన పార్టీ సంస్థాగత పునర్నిర్మాణ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోనే మెంబర్‌షిప్ విషయంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందన్నారు. కార్యకర్తలు మొక్కవోని దీక్షతో పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చారని అదే స్ఫూర్తితో లోకల్‌బాడీ ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. పనిచేసే కార్యకర్తలకు నామినేటెడ్, పార్టీ పదవుల్లో పెద్దపీట ఉంటుందన్నారు. తెలంగాణ సంపదను దోచుకోని లక్షల కోట్లు లూటీ చేసిన కేసీఆర్‌కు రాష్ట్రంలో స్థానం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రుద్ర సంతోష్, సత్తు మల్లేశం, రహమతు హుస్సేన్, వైద్యుల అంజన్ కుమార్, వెలిచాల రాజేందర్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఒడితెల ప్రణవ్, వి.నరేందర్‌రెడ్డి, కటకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధాని చేద్దాం

దేశంలో బీజేపీ గ్రాఫ్ తగ్గుతోందని, రాబోయే రోజుల్లో మోదీని గద్దె దించి రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ పాలన గాడి తప్పిందని, 11ఏళ్లుగా ప్రజలను మభ్యపెట్టడం తప్పా బీజేపీ చేసిందేమి లేదని విమర్శించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూసేందుకు ప్రజలు తహతహలాడుతున్నారని అన్నారు.

విద్యుత్ సమస్యలపై రైతుల ధర్నా



గంభీరావుపేటలో ధర్నా చేస్తున్న రైతులు

గంభీరావుపేట/గన్నేరువరం: అప్రకటిత కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో రైతులు బుధవారం ధర్నాకు దిగారు. రైతులు మాట్లాడుతూ వానాకాలం పంటల సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో కరెంటు కోతలు పెరిగాయన్నారు. లోవోల్టేజీతో విద్యుత్‌మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంభీరావుపేటలో సెస్ ఏఈ అనంద్‌కుమార్ రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

గద్దె నిర్మించినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చాకలివానిపల్లిలో రైతులు రోడ్డెక్కారు. వర్షాలు లేక ఇబ్బందులు పడుతుంటే.. ట్రాన్స్‌ఫార్మర్ లేక పొలాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి పంటలను కాపాడాలని కోరారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో అమ్మోనియా లీక్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో బుధవారం రెండోషిఫ్ట్‌లో అమ్మోనియా కన్వర్టర్ పైప్‌లైన్ లీకైంది. దీంతో కర్మాగారాన్ని షట్‌డౌన్ చేశారు. తద్వారా యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్ మరమ్మతులు చేయడానికి సుమారు 15 రోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. వానాకాలం సీజన్‌కు ముందు వార్షిక మరమ్మతులతో మే 6 నుంచి 33 రోజులపాటు ప్లాంట్ షట్‌డౌన్ చేశారు. జూన్ 16న యూరియాను పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్ షట్‌డౌన్ కావడంతో తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడింది. త్వరితగతిన చేపట్టిన మరమ్మతులు 15రోజులు కొనసాగుతాయని, దీంతో 57,750 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి మృతి



డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయిన బైక్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ప్రాంతానికి చెందిన గాండ్ల సత్యం (53)అనే సింగరేణి ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. తన కూతురు ముద్దసాని లావణ్యను పెద్దపల్లిలోని కాలేజీలో చేర్పించేందుకు బైక్‌పై వస్తున్నాడు. అప్పన్నపేట శివారులో డివైడర్‌ను అదుపుతప్పి ఢీకొన్నాడు. ఆ తర్వాత డివైడర్ ఆవతల ఉన్న రోడ్డుపైకి పడ్డాడు. ఇంతలోనే అటుగా వేగంగా వస్తున్న లారీ సత్యం పైనుంచి దూసుకెళ్లడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. వెంట ఉన్న కూతురు డివైడర్‌పై పడగా గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై మల్లేశ్ తన సిబ్బందితో వెళ్లి గాయపడ్డ లావణ్యను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

స్పందిస్తున్న హృదయాలు

- అజయ్‌కి అండగా ఆరోగ్యశాఖ మంత్రి
- మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలింపు

సాక్షి స్పందన

వీణవంక: వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన సుద్దాల అజయ్ వినాయక విగ్రహాల తయారీకేంద్రంలో గాయపడి అచేతనస్థితిలో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్‌కు రూ.10లక్షలు ఖర్చవుతుండటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడటంపై 'సాక్షి'లో బుధవారం 'నిరుపేదకు పెద్ద కష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ సంఘటనపై సీఎంవో కార్యాలయం, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయం నుంచి ఆరా తీశారు. అజయ్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి వాకాబు చేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. అజయ్‌కి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేయడంతో హుటాహుటిన అజయ్ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి ఆరా తీశారు. దగ్గరుండి నిమ్స్‌కు తరలించారు. కాగా.. పలువురు దాతలు ఇప్పటి వరకు రూ.1.20 లక్షల సాయం అందించారు.

ఏపీకే ఫైల్ లింక్‌తో రూ.46వేలు మాయం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



బ్యాంక్ నుంచి ఖాళీ అయిన డబ్బుల వివరాలను చూపుతున్న అంజయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తెలిసిన వ్యక్తి పంపిన మెసేజ్ కదా.. అని ఏపీకే ఫైల్ లింక్ క్లిక్ చేయగా బ్యాంక్ ఖాతా ఖాళీ కావడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన పెరుమాండ్ల అంజయ్య తెలిపిన వివరాలు. ఈనెల 13న సాయంత్రం తనకు పరిచయం ఉన్న వ్యక్తి మొబైల్ నుంచి తమ సంఘం గ్రూప్‌లో పీఎం కిసాన్ పేరిట ఏపీకే లింక్ రాగా.. ఓపెన్ చేశాడు. 14వ తేదీ రాత్రి 2 నుంచి 3.30 గంటల వరకు ఖాతాలో నుంచి దఫదఫాలుగా రూ.46వేలు కాజేశారు. వెంటనే 1930కి కాల్ చేశాడు. అంతే కాకుండా ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామానికి చెందిన న్యాలకంటి సతీశ్ ఖాతా నుంచి గతేడాది డిసెంబర్ 9న సైబర్ నేరగాళ్లు రూ.96వేలు కాజేశారు.

ఎమ్మెస్సార్ సతీమణి సుగుణ మృతి

కరీంనగర్: దివంగత మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరావు సతీమణి మేనేని సుగుణ(85) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. వారి అంత్యక్రియలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు జరుగనున్నాయి. ఎమ్మెస్సార్ సతీమణి సుగుణదేవి మరణం బాధకరమని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తదితరులు ఒక ప్రకటనలో నివాళి అర్పించారు.

డబుల్‌బెడ్రూమ్ ఇళ్లకు తాగునీటి సౌకర్యం

జ్యోతినగర్(రామగుండం): జంగాలపల్లె శివారులోని డబుల్‌బెడ్రూమ్ ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన పైప్‌లైన్ పనులను రామగుండం బల్దియా ఈఈ రామన్ బుధవారం పరిశీలించారు. రూ.3 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. నర్రాశాలపల్లె రోడ్డు నిర్మాణంలో ఉందని, అందుకే డబుల్‌బెడ్రూమ్ ఇళ్లకు నేరుగా తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ నిర్మిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఈ జమీల్, ఏఈ చంద్రమౌళి, కాంట్రాక్టర్ మహేందర్ గౌడ్, మధు, శంకర్ పాల్గొన్నారు.

తిరుపతికి మరో ప్రత్యేక రైలు

- నాందేడ్ వయా కరీంనగర్ మీదుగా
- ఆగస్టు 2న ప్రారంభం



తిరుపతి ప్రత్యేక రైలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి మరో ప్రత్యేక రైలు నడిపించేందుకు దక్షిణమధ్య రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఆగస్టు2 నుంచి 31 వరకు ఈ ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే కరీంనగర్ నుంచి తిరుపతికి ఒక రెగ్యులర్ రైలుతోపాటు మరో ప్రత్యేక రైలు నడుస్తోంది. సోమ, గురు, ఆదివారం ఈ రైళ్లు కరీంనగర్ నుంచి తిరుపతికి నడుస్తుండగా కొత్త రైలు ప్రతి శనివారం నాందేడ్ నుంచి కరీంనగర్ మీదుగా వెళ్తుంది. ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి కరీంనగర్ మీదుగా నాందేడ్‌కు వెళ్తుంది. ప్రతి శనివారం నాందేడ్‌లో సాయంత్రం 4.50గంటలకు బయల్దేరి ఆదివారం ఉదయం 11.30గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. అదే రోజు రాత్రి 7.45గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 9.08గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుంది. ప్రత్యేక రైలును ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ రైల్వేస్టేషన్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ భానుచందర్ కోరారు.

బనకచర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పకునేదిలేదు

- రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు



పెద్దపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాక్షి పెద్దపల్లి: బనకచర్ల ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబురాల సభ నిర్వహించారు. మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, నీటి వాటా విషయంలో రాజీ లేదన్నారు. గోదావరి నదీజలాల్లో తెలంగాణ హక్కుగా రావాల్సిన ఒక్క నీటిబొట్టును కూడా వదులుకోబోమని స్పష్టం చేశారు. రాష్ట్రనీటివాటా విషయంలో కేంద్రప్రభుత్వంతో అన్నిప్రయత్నాలు చేస్తామని తెలిపారు. గోదావరి జలాల విషయంలో తమ ప్రభుత్వ వైఖరిని సీఎం రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో స్పష్టం చేసినా ఏదోరకంగా బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనేఉన్నారని మండిపడ్డారు. అతిసమీపంలోని మంథని, పెద్దపల్లి పట్టణం, రామగుండం నగరానికి నీళ్లు ఇవ్వకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఆయన దుయ్యబట్టారు. కూలిపోయిన డ్యామ్‌ల గురించి బీఆర్‌ఎస్ నేతలు ఇవాళ గొప్పగా మాట్లాడుతుఉన్నారని, బనకచర్ల విషయంలో ఆనాడులేని ఆరాటం ఇవాళ వచ్చిందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ ఉరఫ్ సీతక్క తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ఆర్థికతోడ్పాటు అందిస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో బతకాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం అమలు చేసే ప్రతీపథకాన్ని మహిళల పేరు మీదనే అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.